
సాక్షి
పల్నాడు
సోమవారం । 15 । జూలై । 2024



అమ్మవారికి బోనాలు
తెనాలిరూరల్: కఠెవరం గ్రామం జేపీ కాలనీలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 503.00 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా ఆషాఢమాస ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వెంచేసియున్న మహాంకాళి అమ్మవారి ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఈనెల 21న పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణాచలం వెళ్లే శివ భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు–2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ తెలిపారు. గిరిప్రదక్షిణ మహోత్సవానికి డిపో–2 నుంచి స్పెషల్ హైటెక్ బస్సులు రెండు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బస్సులు ఈనెల 19న బయలుదేరి 20న కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌కు వెళతాయని, అదేరోజు రాత్రి అక్కడకు చేరుకుంటాయని తెలిపారు. 21న గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం బస్సు బయలుదేరి 22న గుంటూరు చేరుకుంటుందన్నారు. టికెట్లను 96164, 96089 సర్వీసుల ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ 2,420 ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382897459, 7382896403కు సంప్రదించాలని సూచించారు.

350 క్వింటాళ్ల బియ్యం బస్తాలు సీజ్



ఫిరంగిపురం: అనధికారికంగా బియ్యం తరలిస్తున్నార న్న సమాచారంతో సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురంలోని రైస్‌మిల్లును తనిఖీ చేశారు. కేవీఆర్ ట్రేడర్స్ నుంచి బియ్యం అక్రమంగా తరలిస్తున్నారంటూ తహసీల్దార్ రాఘవేంద్ర రావుకు సమాచారం అందింది. దీంతో సీఎస్ ఆర్‌ఐ అనిల్ కుమార్, ఆర్‌ఐ భవాని, వీఆర్వో శ్రీనివాస్ వెళ్లి తనిఖీ చేశారు. 390 బస్తాలు బియ్యం, వంద బస్తాల నూకలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దుర్గమ్మకు బంగారు కాసుల హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. గుంటూరుకు చెందిన ఎస్.హనుమాన్, ఎస్.వి.ఆర్.ఎల్.జ్యోతి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావును కలిసి రూ.4.50 లక్షలు వెచ్చించి 71 గ్రాముల బంగారంతో తయారు చేసిన లక్ష్మీ కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఎట్టకేలకు జిల్లా కోర్టుకు స్టాంప్‌లు!

పిటిషన్ దాఖలుకావడంతో అధికారుల్లో కదలిక

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలో నెలకొన్న స్టాంప్‌ల కొరతపై దాఖలైన పిటిషన్‌తో అధికారుల్లో కదలిక వచ్చింది. సోమవారం స్టాంప్‌లు జిల్లా కోర్టుకు చేరనున్నాయి. జిల్లా కోర్టులో స్టాంప్‌లు లేకపోవడంతో ఎదురవుతున్న ఇక్కట్లపై బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి మే నెలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గతేడాది నుంచి రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 స్టాంప్‌ల కృత్రిమ కొరత నెలకొందని పిటిషన్‌లో తెలియజేశారు. స్టాంప్‌ల కొరత వల్ల న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బంది పడాల్సి వస్తోందని, అధిక ధరకు బయట కొనాల్సి వస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణకు వచ్చిన పిటిషన్ వాయిదా పడింది. ఈసారి వాయిదాకు రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారి హాజరై, స్టాంప్‌ల కొరతపై సంజాయిషీ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో రూపాయి, రూ.2, రూ.5 స్టాంప్‌లు ప్రధాన కార్యాలయం నుంచి గుంటూరుకు వచ్చాయని, సోమవారం జిల్లా కోర్టుకు చేరనున్నాయని బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి ఆదివారం తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1,902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,231 క్యూసెక్కులు విడుదల చేశారు.

టీడీపీలో చల్లారని వర్గపోరు

నరసరావుపేట 'దేశం'లో నెలలో మూడు గొడవలు, ఆరు పంచాయితీలు

- ఎమ్మెల్యే ఇంట్లోనే ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న తెలుగు తమ్ముళ్లు
- సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఇటీవల ఎమ్మెల్యే ఇంటిపై దండెత్తిన జనసేన కార్యకర్తలు
- ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జిలాని
- తాజాగా తనకు గుర్తింపు ఇవ్వడం లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు ఆందోళన
- అక్రమార్జన మార్గాల పంపకాలలో తలెత్తుతున్న గొడవలు
- చంద్రబాబు, లోకేష్ వరకు చేరిన పంచాయితీ



టీడీపీ నేత కొల్లి బ్రహ్మయ్య కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు

సాక్షి, నరసరావుపేట: అధికారం చేపట్టిన నెల రోజులలోనే నరసరావుపేట తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. ఎన్నికల ముందు ఎమ్మెల్యే సీటు కోసం పడిన గొడవలు మరిచిపోకముందే ఫలితాల తరువాత రాజకీయ ఆధిపత్యం, పదవులు, అక్రమార్జన కోసం పార్టీలో లుకలుకలు బయటపడుతున్నాయి. నరసరావుపేటలో కూటమి నెల రోజుల పాలన మూడు గొడవలు, ఆరు పంచాయితీలుగా సాగుతోందని ఆ పార్టీల నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

న్యాయం చేయాలంటూ 'చల్లా' ధర్నా

పార్టీ గెలుపు కోసం ఇరవై ఏళ్లుగా శ్రమించిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు శనివారం రాత్రి అదే పార్టీ సీనియర్ నేత కొల్లి బ్రహ్మయ్య క్యాంప్ ఆఫీస్ ఎదుట తన వర్గీయులతో ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే చదలవాడ పార్టీలోని కీలక బాధ్యతలను కొల్లి బ్రహ్మయ్యకు అప్పగించారు. గత కొన్ని రోజులుగా పార్టీ అంతర్గత వ్యవహారాలు ఆయన చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో చల్లా సుబ్బారావు కార్యకర్తల సమస్యలను పట్టించుకోకుండా టీడీపీ గెలుపు కోసం పనిచేయని వారికి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. కార్యకర్తలు కొల్లి బ్రహ్మయ్యను కలవాలంటే గంటల కొద్ది వేచియుండాల్సి వస్తోందని, ఒక్కోసారి రెండు రోజుల పాటు పడుతోందని, ఫోన్లు సైతం ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలానే వ్యవహరిస్తే సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. కొల్లి బ్రహ్మయ్య ఇచ్చిన సమాచారంతో నరసరావుపేట రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని సుబ్బారావుకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపేశారు.

ఎమ్మెల్యే సమక్షంలోనే దాడులు

నరసరావుపేట అధికారపార్టీ నేతల మధ్య జరుగుతున్న అంతర్గత దాడులకు ఇదొక పరాకాష్ట. సాక్షాత్తు ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ఇంట్లో ఆయన సమక్షంలో ఈ నెల 4వ తేదీన టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. సంఘటనలో ఇస్సపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లూరి హరికృష్ణకు రెండు చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. హరికృష్ణపై టీడీపీలోని మరోవర్గానికి చెందిన ప్రసాద్, సాయి మరికొందరు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. తనను కొట్టే సమయంలో ఎమ్మెల్యే కాపాడలేదని, తీవ్ర గాయాలతో ఉన్న తాను అడిగినా మంచి నీరు కూడా ఇవ్వకుండా బయటకు నెట్టి తలుపులు వేసుకున్నారని బాధితుడు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈకేసులో ఇప్పటికే ముగ్గురు టీడీపీ కార్యకర్తలను నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగతావారి కోసం గాలిస్తున్నారు.

ఉండవల్లి కరకట్టకు చేరిన పంచాయితీ

అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నరసరావుపేట కూటమి నేతల మధ్య కుమ్ములాట పంచాయితీ టీడీపీ అగ్రనాయకులు చంద్రబాబు, లోకేష్‌ల వద్దకు చేరింది. ఎమ్మెల్యే చదలవాడ తీరుపట్ల అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయట. ఎన్నికల ముందు చదలవాడకు టికెట్ ఇవ్వొద్దని ప్రయత్నాలు చేసిన వారు తెరవెనుక ఉండి అరవింద్‌బాబుపై ఫిర్యాదులు చేయించినట్లు తెలుస్తోంది. ఎలాగైనా ఎమ్మెల్యే అధికారాలను పరిమితం చేయాలని కుట్రతోనే పేటలో నిత్యం ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారని అరవింద్ బాబు వర్గం ఆరోపిస్తోంది.

అధికారంలో వాటా కోసం జనసేన..

అధికారంలోకి వచ్చిన తరువాత పదవులు, ఆదాయ మార్గాల్లో 33 శాతం వాటా తమకు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని ఎమ్మెల్యే అరవింద్‌బాబు ప్రస్తుతం పట్టించుకోవడం లేదని జనసేన ఆరోపిస్తోంది. రేషన్ డీలర్ల నియామకం, ఎండీఎం కాంట్రాక్టులు, వ్యవసాయ మార్కెట్ యార్డు దుకాణాల కేటాయింపులలో జనసేనకు సముచిత స్థానం ఇవ్వకపోగా, కనీసం సమాచారం కూడా ఇవ్వడంలేదని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. ఈ వాటాల పంపకాలపై జనసేన ప్రతినిధులు చదలవాడను కలసినా ఎటువంటి హామీ దక్కలేదట. దీంతో ఎమ్మెల్యే అరవింద్ బాబు నిర్వహించే కార్యక్రమాలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ దూరంగా ఉంటున్నారట. కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి ప్రధాన కారణమైన తమ పట్ల చిన్నచూపు చూడటం ఏంటని జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయ తరలింపుపై రగడ

ప్రకాశ్ నగర్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శాశ్వత భవనానికి తరలించాలన్న విషయం టీడీపీ నేతల మధ్య గొడవకు దారితీసింది. టీడీపీలోని ఓ వర్గం కార్యాలయాన్ని అద్దెభవనం నుంచి తరలించాలని ప్రయత్నిస్తుండగా, పార్టీలోనే మరో వర్గం తరలించడానికి వీలు లేదంటూ పట్టుబట్టింది. దీంతో రెండు వర్గాల మధ్య వివాదం ముదిరి గత వారంలో ప్రత్యక్ష దాడులకు దిగారు. పార్టీ సీనియర్ నాయకుడు రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఓ దస్తావేజు లేఖరి కార్యాలయం వద్ద ఉండగా మరో వర్గం నాయకుడు అనుచరులతో అక్కడికి వెళ్లి దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

'దివ్యో'పదేశం

- క్రీస్తుబోధనలు మానవాళికి రక్షణ
- ఘనంగా దివ్యపూజాబలి
- కార్మెల్ మాత ఉత్సవాలు ప్రారంభం



ఫిరంగిపురం: క్రీస్తుపై విశ్వాసంతో మెలగాలని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి చెప్పారు. బాల ఏసు ఆలయంలో కార్మెల్‌మాత ఉత్సవాల సందర్భంగా దివ్యపూజాబలి ఆదివారం నిర్వహించారు. ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనలు మానవాళికి రక్షణ అని వివరించారు. కార్మెల్‌మాతను ప్రార్థిస్తే మంచి జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు బి.ప్రవీణ్‌కుమార్, మఠకన్యలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దివ్యపూజాబలి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కొండను ఎక్కి కార్మెల్ మాతను దర్శించుకున్నారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. రాత్రికి భక్తులు అక్కడనే నిద్రించారు. సోమవారం నిర్వహించే దివ్యపూజాబలి పూజల్లో పాల్గొననున్నారు.

పటిష్ట భద్రత

కార్మెల్‌మాత పండుగ సందర్భంగా గ్రామంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు 150 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారని వివరించారు. సీఐలు ఇద్దరు, ఆరుగురు ఎస్‌ఐల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

హామీల అమలులో టీడీపీ విఫలం

- మాటలతో మభ్యపెట్టేందుకు చంద్రబాబు యత్నం
- నెలరోజుల్లోనే తల్లికి వందనం, జీపీఎస్, ఉచిత ఇసుక, పింఛన్ల విషయంలో ప్రజలను మోసం చేసిన టీడీపీ ప్రభుత్వం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలుచేయటంలో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పించుకునేందుకు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆరు హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. వీటిలో ఒకటి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి పేరుతో ప్రతి తల్లికి రూ.15వేలు ఇస్తామని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా 49లక్షలమందికి ఏడాదికి రూ.6వేల కోట్లు ఇచ్చారన్నారు. ఆ పథకాన్నే చంద్రబాబు తల్లికి వందనం అని పేరు మార్చి ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ఆ కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని స్పష్టంగా ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. టీడీపీ నేత, ప్రస్తుత రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ పథకంపై తన నియోజకవర్గంలో ప్రచారం చేస్తూ నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అంటూ ఒక ఇంట్లో ఉన్న నలుగురు పిల్లలు, వారి తల్లికి ఇచ్చిన హామీ వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అవుతుందన్నారు. ఈ విధంగా ప్రచారం చేసి ఓట్లు దండుకున్న టీడీపీ కూటమి నాయకులు అమలు విషయంలో మాత్రం ఇంట్లో తల్లికి మాత్రమే రూ.15వేలు ఇస్తున్నట్లు జీఓ నంబరు 29 జారీ చేశారన్నారు. జీఓలో బిడ్డలకు కాదు తల్లికి అనే విషయం స్పష్టంగా ఉందని విలేకర్లకు జీఓను చదివి వినిపించారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదివే పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేసిందని, అయితే తమ పిల్లలకు తల్లికి వందనం అందుతుందో లేదోనని ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు.

- అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులకు జీపీఎస్ అమలు చేస్తున్నట్లు ఇచ్చిన 2023 గెజిట్ నోటిఫికేషన్‌ను తెరపైకి తీసుకొచ్చి ఈనెల 12న అమలుచేస్తున్నట్లు జీఓ నంబరు 54ను విడుదల చేశారన్నారు. దీనిపై ఉపాధ్యాయులు ఆందోళనకు దిగితే పాత ప్రభుత్వ నిర్ణయానికే సంతకం చేయటం జరిగిందని క్లారిటీ ఇచ్చారన్నారు. ఒక జీఓను విధి విధానాలు పరిశీలించకుండానే విడుదల చేస్తారా అని ప్రశ్నించారు. నెలరోజుల్లోనే ఉపాధ్యాయులను సైతం మభ్యపెట్టి మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు.
- సామాజిక భద్రతా పింఛన్లను నరసరావుపేట నియోజకవర్గంలోని అల్లూరివారిపాలెంలో 22, దొండపాడులో 12, మాచవరంలో ఐదుగురికి మొత్తం 39మందికి పింఛన్లు ఆపారని, ఈ పింఛన్లు ఆపవలసిన అవసరం ఏంటని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో కుల,మత, పార్టీలకు అతీతంగా 39లక్షల మందికి ఉన్న పింఛన్లను 65లక్షల మందికి పెంచి ఇవ్వటం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచి ఒక్కో గ్రామంలో 150 నుంచి 300 మందివరకు పింఛన్లను ఆపే ప్రయత్నంలో ఇప్పటికే అధికారులకు టీడీపీ నాయకులు లేఖలు రాశారని, అదే జరిగితే రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.
- ఇసుక ఉచితంగా ఇస్తున్నామని టీడీపీ శ్రేణులు క్షీరాభిషేకాలు చేసుకుంటున్నారని, వాస్తవానికి నరసరావుపేటలో గత మూడురోజుల వ్యవధిలో 20 టన్నుల ఇసుక రూ.14వేలకు విక్రయించారన్నారు. తమ ప్రభుత్వంలో 40టన్నుల లారీ రూ.24వేలకు అమ్మారని గుర్తుచేశారు. గతంలో టన్నుకు రూ.600 తీసుకుంటే ఇప్పుడు ఉచితమని చెప్పి రూ.700 వరకు తీసుకుంటున్నారని దుయ్యబట్టారు. గతంలో మాదిరిగానే ప్రజలకు తక్కువ ధరకు ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ అధికారుల సేవలు మరువలేం

పల్నాడు జిల్లా ప్రథమ కలెక్టర్, జేసీలు శివశంకర్, శ్యాంప్రసాదులకు ఘన సన్మానం



వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను సన్మానిస్తున్న పల్నాడు జిల్లా కళాక్షేత్రం సభ్యులు



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాదును సన్మానిస్తున్న దృశ్యం

నరసరావుపేట: నూతన జిల్లాకు ప్రప్రథమ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లుగా వ్యవహరించిన లోతేటి శివశంకర్, ఎ.శ్యాంప్రసాదుల సేవలను జిల్లా ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని పలువురు పేర్కొన్నారు. శివశంకర్ వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్‌గాను, శ్యాంప్రసాదు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లిన విషయం విదితమే. ఈ సందర్భంగా శనివారం రాత్రి పట్టణంలో కాసు కల్చరల్ సెంటర్‌లో పల్నాడు జిల్లా కళాక్షేత్రం అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ప్రజాకలెక్టర్ శివశంకర్ లోతేటి పుస్తకావిష్కరణ చేశారు. డీఆర్‌ఓ కె.వినాయకం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి, ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నరసరావుపేట అధ్యక్షుడు నాగోతు ప్రకాష్, వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావులు ప్రసంగించారు. రెండేళ్ల జిల్లాకు, జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేసిన సేవలను గుర్తుచేశారు. ఉత్తమ అధికారుల సేవలను మరువ లేమన్నారు. పల్నాడు కళాక్షేత్రం, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆర్డీఓ పి.సరోజిని, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి గంధ్రకోట మురళి, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి, డాక్టర్ సృజన, డాక్టర్ రహమతుల్లా, జీవీఎస్ రాము, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, మాజీ ఉపసర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్ల తనిఖీలు

తెనాలి: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందుగా గాంధీనగర్ రైతుబజారును సందర్శించారు. అక్కడ ప్రభుత్వం ఏర్పాటుచేసిన రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రం మూసి ఉండటాన్ని గమనించారు. ఆ పక్కనే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న బియ్యం విక్రయ కేంద్రాన్ని తనిఖీచేశారు. స్టాకును పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేదని మండిపడ్డారు. తహసీల్దార్, ఎస్టేట్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ దుకాణాన్ని సీజ్ చేసి పంచనామా చేయాలని ఆదేశించారు. రైతుబజార్‌లోని దుకాణాల్లో టమాట కిలో రూ.52కు అమ్మడాన్ని ప్రశ్నించారు. ఒక రోజులో ఏడు రూపాయలు పెరగటం ఏమిటని నిలదీశారు. రైతుబజారు వెలుపల మరో కూరగాయల విక్రయకేంద్రం, తోపుడుబండిపై కూరగాయలు విక్రయిస్తున్న మహిళను ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల్లోంచి తీసిన పూడికను తరలించకుండా అక్కడే ఉంచటం ఏమిటని సిబ్బందిని మందలించారు. ఆ తర్వాత పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. వాటిల్లో రేషను కార్డులు ఉండటాన్ని గమనించారు. విచారణకు సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను ఆదేశించారు.

విత్తన చట్టం.. మోసాలకు కళ్లెం

- ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో లైసెన్స్‌ల ప్రదర్శన తప్పనిసరి
- దుకాణం ఎదుట ధరల సమాచారం ఉండాల్సిందే..
- ప్రతి కొనుగోలుదారుడికి బిల్లులు ఇవ్వాలి
- అన్ని చట్టాలు ఉన్నా అమలుకాని నిబంధనలు



సత్తెనపల్లిలో పురుగుమందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు (ఫైల్)

సత్తెనపల్లి: ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ప్రైవేట్ దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు సీజ్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. విత్తన సంచిపై తయారీ స్థలం, కంపెనీ, ఫోన్ నెంబర్, లాట్, బ్యాచ్ నెంబర్, గడువు, జన్యు స్వచ్ఛత, మొలక శాతం లేకుండానే విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల నిస్సహాయతను ఆసరాగా తీసుకొని కొందరు నకిలీవి అంటగడుతున్నారు. జిల్లాలో 1,700 ప్రైవేట్ డీలర్లు ఎరువుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాటిలో 600 మంది విత్తన విక్రయ డీలర్లు కాగా మిగిలిన దుకాణాల్లో ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నారు. దుకాణాలు ఎదుట ఎరువు, విత్తన ధరలు, స్టాక్ సమాచారం ఉండడం లేదు. అధికారుల ఎదుట తాము బిల్లులు, రసీదులు ఇస్తున్నామని చెబుతున్నారే గానీ... రసీదులు ఇవ్వడం లేదు. అవగాహన లేక సంచిపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం లేదు. దీంతో బస్తా, ప్యాకెట్లపై లేబుల్ లేకుండా రైతు డీలర్ వద్ద కొనేస్తున్నారు. నష్టపోయిన అనంతరం ఆధారాలు లేక లబోదిబోమంటున్నారు.

కఠిన చర్యలకు చట్టాలు..

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా డీలర్లపై కఠిన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం - 1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ చట్టం–1983 ఆధారంగా అతిక్రమణ, ఉల్లంఘనలు వర్తించేలా చట్టాన్ని రూపొందించారు. విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్–3 కింద నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వారి దుకాణాలు జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ -ఏ ప్రకారం జరిమానా విధిస్తారు.

షరా మామూలే..

గత నెల రోజుల్లో విడతల వారీగా అధికారులు ఎరువులు, విత్తన దుకాణాలపై దాడులు చేస్తూనే ఉన్నా కొంతమంది డీలర్ల పరిస్థితి షరా మామూలే అన్న విధంగా మారింది. ఇటీవల విజిలెన్స్ అధికారులు సైతం దాడులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై దాడులు నిర్వహించి సుమారు రూ.2 కోట్ల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించరాదంటూ అమ్మకాలు నిలుపుదల చేశారు. అంతేకాక వినుకొండలో రూ.7.50 లక్షలు విలువ చేసే ఎరువులు, పురుగు మందులు విక్రయించరాదంటూ సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

విత్తన లైసెన్సులు ప్రదర్శించాలి..

నిబంధనల ప్రకారం లైసెన్సులు ప్రదర్శించాలి. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అవి లేనివారికి నోటీసులిచ్చి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ చట్టం 1986 క్లాజ్–5 ప్రకారం డీలర్ లైసెన్సు రద్దు చేయడానికి, సస్పెండ్ చేసేందుకు అవకాశం ఉంది. విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్–88 ప్రకారం ఆయా దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయవచ్చు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా డీలర్లు రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. రసీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్–9 ప్రకారం డీలర్‌కు నోటీసు ఇచ్చి సమాధానం చెప్పకపోతే లైసెన్సు రద్దు చేయవచ్చు. ప్రైవేటు విత్తన వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన ఎరువు బస్తాలకు కంపెనీ లేబుల్స్ లేకున్నా... విత్తన చట్టం 1966 సెక్షన్ -7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనం విక్రయిస్తే విత్తన చట్టం 1966 సెక్షన్ -7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్- 8ను అనుసరించి డీలర్ లైసెన్సు రద్దు చేస్తారు. అయితే ఇవేవీ చట్టప్రకారం జరగడం లేదు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు

నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేసే అధికారం ఉంది. ప్రభుత్వం రూపొందించిన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తన దుకాణాల డీలర్లు విక్రయాలు చేపట్టాలి. దుకాణాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి. ప్రతి దుకాణంలో రైతులకు కనిపించేలా ధరల పట్టిక, స్టాక్ వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలి.

–ఐ.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి, పల్నాడు

క్లుప్తంగా

నేలబావిలో గుర్తు తెలియని మృతదేహం



రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని పొలాల్లోని నేల బావిలో గుర్తు తెలియని యువకుడు మృతిచెంది ఉన్నట్లు గ్రామస్తులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అమీర్‌బాషా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పైకి తీయించి, పరిశీలించారు. మృతదేహం వద్ద ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడికి సుమారు 30 ఏళ్లు ఉంటాయని, గళ్ల షర్టు, నల్ల నైట్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9440796168 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



పాములపాడు(తాడికొండ): పాములపాడు గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న కొల్లూరు అశోక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, ఎంపీటీసీ శ్రీరామ్, పరుచూరి నారాయణ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మృతుడు భార్య లలితకు అందజేసి ఓదార్చా రు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తాడేపల్లిరూరల్ : కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథన హల్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ నిందితులు శ్రీధర్‌రెడ్డి, సోమప్ప, సుబ్బారెడ్డి, నాగరాజు, లక్ష్మన్నలను వెంటనే అరెస్ట్ చేయాలని పేర్కొన్నారు. రాగప్ప భూమిని దళిత మహిళ గుండమ్మ కొని రిజిస్టర్ చేసుకుని సాగు చేసుకుంటోందని, భూమి సమస్య ఉంటే మాట్లాడుకోవాలికానీ చంపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవం.. రంగస్థలి వార్షికోత్సవం



నృత్య పోటీలను ప్రారంభిస్తున్న రంగస్థలి ఫైనాన్స్ కమిటీ చైర్మన్ విజయకుమార్ , తదితరులు



నృత్య పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 44వ వార్షికోత్సవం ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. వార్షికోత్సవంలో భాగంగా పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించిన నృత్య పోటీలను రంగస్థలి ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపలవాయి విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలను నిర్వహిస్తున్న రంగస్థలి ఈఏడాది నృత్య కేళిక నిర్వహించటం అభినందనీయమన్నారు. సామాజిక సమస్యలు, వాటి పరిష్కారాలను తెలియచేసేలా కళల ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని కోరారు. శాస్త్రీయ, జానపద తదితర అంశాలలో నిర్వహించిన నృత్య పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో 20 బృందాలు, కళాశాల స్థాయిలో 10 బృందాల విద్యార్థులు వ్యక్తిగత, బృంద నృత్య పోటీలలో తమ ప్రతిభను చాటారు. రంగస్థలి అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, ప్రధాన కార్యదర్శి నల్లపాటి బోస్, గౌరవాధ్యక్షుడు కిలారు వెంకటరావు, కోశాధికారి కె.సూరిబాబు, ఉపాధ్యక్షుడు కె.ఆర్.ప్రసన్నకుమార్, ఎ.ఎ.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి



గొయ్యి తీసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ లక్ష్మీపతి

ఈపూరు: తల్లి, కుమారుడిని హత్య చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి తల్లిని, కుమారుడిని నమ్మించి తీసుకొచ్చి చంపేందుకు ప్రయత్నించిన ముద్దా శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు. నిందితుడి కోసం అన్ని ప్రాంతాలను గాలిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని పూడ్చిపెట్టేందుకు తీసిన గోతిని ఆయన పరిశీలించారు. అనంతరం పవర్ ప్లాంట్ సిబ్బందిని, స్థానిక పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమాజంలో నేరాలు రకరకాలుగా జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, ఈపూరు ఎస్ఐ ఫిరోజ్ ఉన్నారు.

హరికథా భాగవతారిణి శ్రీవాణికి సత్కారం



శ్రీవాణిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ హరికథా భాగవతారిణి వి.శ్రీవాణి కళల తెనాలి నుంచి ఉద్భవించిన కళాకారిణి అని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంత్యుత్సవాలు పురస్కరించుకుని ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరగాల్సిన సాంస్కృతిక కార్యక్రమం, ప్రముఖ హరికథా భాగవతారిణి వి.శ్రీవాణిచే 'విజయముద్రిక' హరికథాగానం, శ్రీవాణికి సత్కార సభ వర్షం కారణంగా రద్దయింది. దీంతో స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీవాణిని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా సత్కరించారు. శివకుమార్ మాట్లాడుతూ పురుషులకే ప్రత్యేకమైన హరికథ కళలో తెల్లాకుల వెంకటేశ్వర గుప్త కృషితో ఎందరో బాలికలు నేర్చుకుని హరికథా భాగవతారిణులుగా ఎదిగారని గుర్తుచేశారు. అలాంటి వారిలో ఒకరైన శ్రీవాణి రాష్ట్రంతో సహా దేశంలోని పలు నగరాల్లో హరికథాగానం చేశారని కొనియాడారు. వాణీ దళం పేరుతో ప్రదర్శనలిచ్చి ఎన్నో సత్కారాలను పొందినట్టు తెలిపారు. అలాంటి గొప్ప కళాకారిణిని ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ సత్కరించడం అభినందనీయమని చెప్పారు. హరికథ కళ తనకిచ్చిన అదృష్టమే ఇలాంటి సత్కారాలని శ్రీవాణి అన్నారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, మొగల్ అహ్మద్ బేగ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, దేసు శ్రీనివాసరావు, కాకి దేవసహాయం, గుంటూరు కృష్ణ పెదలంక వెంకటేశ్వర్లు, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము తదితరులు పాల్గొన్నారు. నిర్వాహక సంస్థ బాధ్యులు ఆరాధ్యుల కన్నా, అద్దేపల్లి లక్ష్మణరావు, పిట్టు వెంకట కోటేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వర్షంతో కడప-చిత్తూరు తొలిరోజు ఆట రద్దు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం జరగాల్సిన వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు తొలిరోజు ఆటను రద్దు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన దాసరి భానుప్రకాష్ (19) తన స్నేహితులతో ఈ నెల 11న ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన భానుప్రకాష్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన బంధువులు హుటాహుటిన సత్తెనపల్లిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తెనాలికి చెందిన భానుప్రకాష్ కుటుంబం మూడేళ్ల క్రితం రెంటపాళ్ల గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఓ వైపు మృతుడి తల్లి చాముండేశ్వరి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తండ్రి పాండురంగారావు, సోదరి ధనలక్ష్మిలు కన్నీరు మున్నీరయ్యారు. సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి

తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసున్న వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడు నిండు చేతుల తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలి మండలం తేలప్రోలు గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... గ్రామంలో కొందరు ముస్లింలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గానికి అరాఫత్ నాయకత్వం వహిస్తుండగా మరో వర్గానికి గ్రామ సర్పంచ్ బాషా నాయకుడిగా ఉన్నారు. రెండు వర్గాల్లోని కొందరు యువకులు ఇటీవల ఎన్నికలకు ముందు పట్టణ షరాఫ్ బజార్‌లో ఘర్షణ పడగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆదివారం రెండు వర్గాలు ఘర్షణ పడగా, అరాఫత్ వర్గానికి చెందిన ఫయాజ్‌కు పొట్టపై ఎడమ భాగంలో కత్తి గాయమైంది. వెంటనే అతన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు సిబ్బంది గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కత్తితో దాడి చేసిందని ఎంత మంది? ఎవరెవరు ఉన్నారు? వంటి అంశాలపై స్పష్టత రావాలని పోలీసులు తెలిపారు.

మాజీ సీఎంపై విష ప్రచారం తగదు

- వైఎస్ జగన్ నిర్ణయాలతో ఏపీ అభివృద్ధిలో ముందడుగు వేసింది
- వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



హనుమంత్ నాయక్

తాడేపల్లిరూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాల వల్లే ఏపీ అభివృద్ధిలో ముందడుగు వేసిందని, ఆయనపై విష ప్రచారం చేయడం తగదని వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమంత్ నాయక్ మాట్లాడుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి రమేష్, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డిలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పదవులు అనుభవించారని, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి పీవీ రమేష్, వి.లక్ష్మణ రెడ్డిలతో పాటు మరికొందరు కలసి అదేపనిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం దుర్మార్గమని అన్నారు. పీవీ రమేష్‌కు చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలకు ఈ ఐదు సంవత్సరాల్లో ఎంత బడ్జెట్ అవసరమవుతుందో.. రాష్ట్రం ఎన్ని లక్షల కోట్ల రూపాయల అప్పుల పాలవుతుందో.. ప్రజలకు చెప్పాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలన వలనే నీతి ఆయోగ్ ప్రకటించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందడగు వేయడం జరిగిందన్నారు.

మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్
- 20 నుంచి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నిద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్ బాబు, విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు మండిపడ్డారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమవేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెస్, కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ నంబర్ 77ను రద్దు చేసి ఎయిడెడ్ సంస్థల విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. హాస్టళ్లలో సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 నుంచి 30 వరకు హాస్టల్ నిద్రలు చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్ దుర్గా సాయి, డేవిడ్ , అజయ్, కిరణ్, దేవేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని గుర్తుతెలియని యువతి మృతి

- మారుపేరుతో అద్దెకు దిగిన జంట
- బట్టలు తీసుకుని ముందే వెళ్లిపోయిన యువకుడు
- కేసు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులు



మృతి చెందిన యువతి

తాడేపల్లిరూరల్: డోలస్ నగర్‌లోని ఓ ఇంట్లో గుర్తు తెలియని యువతి ఉరివేసుకుని మరణించింది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. నెల రోజుల క్రితం ఈ ప్రాంతానికి వచ్చిన జంట మారుపేర్లతో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. తమ పేర్లు చిన్నా, రూప(30)గా పరిచయం చేసుకున్నారు. నాలుగు రోజుల నుంచి వీరిద్దరూ గొడవ పడుతున్నారు. పెద్దపెద్దగా కేకలు వేసుకోవడంతో సహజీవనం చేయడానికి ఇక్కడకు వచ్చారని స్థానికులు అనుమానించారు. ఆదివారం 'నీతో అనవసరంగా వచ్చాను' అని రూప అనడంతో చిన్నా బట్టలు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత మనస్తాపం చెందిన రూప ఇంటి లోపలకు వెళ్లి గడియ పెట్టుకుని ఉరివేసుకుంది. వీరిద్దరికి సంబంధించిన ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు. ఎవరైనా ఈ యువతి మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో 08645272186 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ రమేష్ కోరారు.

మా బిడ్డను బతికించండి !

- మెదడుకు ఇన్‌ఫెక్షన్‌తో ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలుడు
- ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు
- రూ.10 లక్షలు ఖర్చవుతుందన్న వైద్యులు



కుమారుడితో తల్లి సుధారాణి



విజయవాడ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న జాన్‌వెస్లీ

బల్లికురవ: మెదడులో ఇన్‌ఫెక్షన్ చేరి వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్న తన బిడ్డకు ఆర్థిక సాయంతో చేయూత నివ్వాలని తల్లిదండ్రులు బడుగు సుధారాణి, చినబాబు వేడుకుంటున్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పెదఅంబడిపూడి గ్రామానికి చెందిన సుధారాణి ప్రకృతి వ్యవసాయంలో వల్లాపల్లి యూనిట్‌లో ఐసీఆర్పీ పని చేస్తోంది. భర్త చినబాబు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. వీరికి స్టీఫెన్‌పాల్, జాన్ వెస్లీ ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో స్టీఫెన్ పాల్ 5వ తరగతి అద్దంకిలో చదువుతుండగా, రెండో కుమారుడు జాన్ వెస్లీ అంబడిపూడిలో 4వ తరగతి చదువుతున్నాడు. ఈ కుటుంబంపై విధికి కన్నుకుట్టడంతో పదిరోజుల కిందట రెండో కుమారుడు జాన్‌వెస్లీకి జ్వరం సోకింది. అందులో ఫిట్స్ రావడంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు జరిపి మెదడులో ఇమ్యూనిటీ సక్రమంగా లేదని, ఇన్‌ఫెక్షన్ సోకిందని తమ వల్ల కాదని చేతులెత్తేశారు. తల్లిదండ్రులు రెండు రోజుల కిందట విజయవాడలోని రెయిన్‌బో వైద్యశాలకు తీసుకెళ్లారు. ఇంజక్షన్లు చేయాల్సి వస్తుందని, రూ.10 లక్షల వరకు అవుతుందని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు. తమది నిరుపేద కుటుంబమని, రెక్కాడితే గానీ డొక్క నిండదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో బిడ్డల్ని చదివిస్తూ జీవనం వెళ్లదీస్తున్నామని తెలిపారు. తమ బిడ్డకు అత్యంత ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేనందున దాతలు చేయూత నివ్వాలని వేడుకుంటున్నారు. ఆర్థిక సాయం చేయగలిగిన దాతలు 8096725577 ఫోన్ నంబర్‌కు ఫోన్ పే ద్వారా పంపాలని విజ్ఞప్తి చేశారు.


అవధాన ప్రక్రియ తెలుగు భాషకు గర్వకారణం



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

చీరాల రూరల్: తెలుగు భాషలో ఉన్న అవధాన ప్రక్రియ ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది అద్భుతమైన విజ్ఞానంతో కూడిన మన ఆస్తి అని సహజ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు, కవి వడలి రాధాకృష్ణ అన్నారు. సహజ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విద్యా కాలేజీలో అవధాని మానేపల్లి నాగకుమారశర్మ అష్టావధానం నిర్వహించారు. కోడూరి ఏకాంబరేశ్వరబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. అవధాన ప్రక్రియ తెలుగు భాషకు గర్వకారణమని, తెలుగువారి సొత్తని తెలిపారు. అవధాని అంటే ఎంతో ఏకాగ్రత ఉన్న పండితుడనే అర్థం వస్తుందని వివరించారు. అవధానానికి విశేషమైన భాషా పాండిత్యం, సమయస్ఫూర్తి, కల్పనా చాతుర్యం, చమత్కారం సమపాళ్లలో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం అవధాని మానేపల్లి నాగ కుమారశర్మకు చిలకపాటి కృష్ణమాచార్యులు, రంగనాయకమ్మ సాహితీ పురస్కారం-2024 'ధారణా ధురీణ' బిరుదును ప్రదానం చేశారు. అనంతరం రావులకొల్లు వెంకట రంగాచార్యులు వేదాశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ నారిపెళ్ల ప్రకాశరావు, పర్చూరి కృష్ణమాచార్యులు, గుత్తి విశ్వేశ్వరరావు, వంగర శ్రీధర్, చిలకపాటి శ్రీనివాసాచార్యులు, కోట నాగేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, పవని భాను చంద్రమూర్తి, కొసనం నాగమాంబ పాల్గొన్నారు.

హేతుబద్ధ ఆలోచనలతో జీవన విధానం మెరుగు



హేతువాద సంఘం పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

బాపట్ల: హేతుబద్ధ ఆలోచనలు మానవ జీవనానికి అవసరమని తెలంగాణ హేతువాద సంఘం ఉపాధ్యక్షులు షేక్ నబీ సాహెబ్ పేర్కొన్నారు. భారత హేతువాద సంఘం 93వ వార్షిక మహాసభలు రెండో రోజు బాపట్లలోని ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ నబీ సాహెబ్ మాట్లాడుతూ మానవ జీవన విధానం మెరుగు పడాలంటే హేతుబద్ధ ఆలోచన అత్యవసరమని తెలిపారు. కార్యకారణ అవగాహనతో నిర్ణయాలు చేస్తూ నిత్య జీవన విధానాన్ని మెరుగు పరచుకోవాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ మనుషులు సహజంగానే హేతుబద్ధ ఆలోచన కలిగి ఉండాలని సూచించారు.' భౌతిక వాస్తవిక వాదం – విశ్వతత్వం' అనే అంశం మీద భారత హేతువాద సంఘ అధ్యక్షుడు డాక్టరు గుమ్మా వీరన్న ప్రసంగిస్తూ ఈ విశ్వం భౌతిక వాస్తవికం అన్నారు. విశ్వం నియమబద్ధంగా పరిణమిస్తోందనిత తెలిపారు. విశ్వానికి ఆది, అంతం లేదని చెప్పారు. అనంతరం హేతువాద సంఘం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

ఆరున్నర కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

రేపల్లె రూరల్: గంజాయి విక్రయ ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆదివారం వివరాలను వెల్లడించారు. మండలంలోని పెనుమూడి కృష్ణానది ఒడ్డున గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బంది దాడులు చేసి, నిందితుల్ని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా వక్కలగడ్డకు చెందిన పరస రాజ్‌కుమార్, చల్లపల్లికి చెందిన కోట ధనుష్ కుమార్, కోట అనిల్‌కుమార్, ఉయ్యూరుకు చెందిన షంషీర్ బేగ్, అంద్రాజు ఈశ్వర్, రేపల్లె మండలం అరవపల్లికి చెందిన భూపతి గోపి, ఓల్డ్ టౌన్‌కు చెందిన షేక్ ఆసీఫ్‌బాబు, పట్టణంలోని 2వ వార్డుకు చెందిన కైతేపల్లి శ్రీహరినాథ్, రేపల్లె మండలం కారుమూరుకు చెందిన అనమర్లపూడి నాగసాయి, పేటేరుకు చెందిన దివి రామమోహనరావును అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి ఆరున్నర కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహన్ని సీజ్ చేశామని చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. పరస రాజ్‌కుమార్, కోట ధనుష్‌కుమార్, కోట అనిల్‌కుమార్‌లు విశాఖజిల్లా పాడేరులో గంజాయిని కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో విక్రయాలు జరుపుతున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. వీరి వద్ద నుంచి మిగిలిన వారంతా కొనుగోలు చేసి రేపల్లె పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల్ని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సమావేశంలో పట్టణ సీఐ నజీర్ బేగ్, ఎస్ఐ హరిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.